సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 3 । నవంబర్ । 2023



పెన్నా నదికి నీటి విడుదల

మైలవరం జలాశయం నుంచి పెన్నా నదిలోకి నీటిని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు నంబటూరు ప్రసాద్‌రెడ్డి అధికారులతో కలిసి గురువారం విడుదల చేశారు. -IIలో



మైనింగ్‌దారులు నిబంధనలు పాటించాలి

మైనింగ్‌దారులు నిబంధనలను పాటించాలని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పేక్ మాసుంబాషా పేర్కొన్నారు. -IIలో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.4 /24.0

జిల్లాలో గురువారం 24.0 - 34.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వేగంగా పింఛన్ల పంపిణీ

కడప రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుక కింద వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ ప్రక్రియ వేగంగా సాగుతోంది. జిల్లాలో మొత్తం 2,64,221 పింఛన్లకు మొత్తం రూ 72,88,27,250 పంపిణీ చేయాలి. రెండో రోజైన గురువారం 2,44,152 పింఛన్లకు రూ 67,36,02,000 పంపిణీ చేశారు. దీంతో పంపిణీ ప్రక్రియ 92.4 శాతం నమోదైంది. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి నగదు ఇవ్వడం పట్ల అవ్వాతాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బాధ్యతల స్వీకరణ



ప్రిన్సిపల్ రమణారెడ్డి

పులివెందుల రూరల్: పులివెందుల జేఎన్టీయూ ప్రిన్సిపల్‌గా ఈసీఈ డిపార్ట్‌మెంట్‌కు చెందిన రమణారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జేఎన్టీయూ రిజిస్ట్రార్ శశిధర్ ఉత్తర్వుల మేరకు ఈయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్టీయూ ప్రిన్సిపల్‌గా తనను ఎంపిక చేసినందుకు ఏపీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ హేమచంద్రారెడ్డి, వైస్ చాన్సలర్ రంగజనార్ధన్, రెక్టార్ విజయ్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

జిల్లా వాసికి అరుదైన గౌరవం



వెంకటసుబ్బయ్య

ప్రొద్దుటూరు కల్చరల్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) తెలంగాణ రాష్ట్ర సెంటర్ చైర్మన్‌గా ప్రొద్దుటూరు మండలం సోములవారిపల్లెకు చెందిన డాక్టర్ జి.వెంకటసుబ్బయ్య యాదవ్ ఎన్నికయ్యారు. వెంకటసుబ్బయ్య 2025 అక్టోబర్ వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఆయన 2021 నుంచి ఢిల్లీలోని ఇండియన్ సొసైటి ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యక్షునిగా కొనసాగుతూ దేశంలో సాంకేతిక విద్య అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ తమ సంస్థ ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలకు సలహాలు, సూచలను ఇవ్వడం, వివిధ సమస్యలపై యువ ఇంజినీర్లకు సదస్సులు, సెమినార్‌లు నిర్వహిస్తామన్నారు

టేబుల్ టెన్నిస్ జట్టు ఎంపిక



అండర్-14 విభాగం పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్: టేబుల్ టెన్నిస్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ ఎంపికలు గురువారం స్థానిక జార్జ్ కారొనేషన్ క్లబ్‌లో నిర్వహించారు. అండర్-14, 17 బాలబాలికల విభాగంలో నిర్వహించిన ఎంపికల్లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనపరచిన ఐదుగురు బాలురు, ఐదుగురు బాలికలను వేర్వేరుగా రాష్ట్రజట్టుకు ఎంపిక చేశారు.కార్యక్రమంలో జార్జ్‌క్లబ్ ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి, కార్యదర్శి గంగిరెడ్డి, సభ్యుడు కొండారెడ్డి, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి ఉదయకుమార్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అరుణకుమారి, టేబుల్ టెన్నిస్ సెలక్షన్ కమిటీ సభ్యుడు శివారెడ్డి, శివశంకర్, పద్మజ, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మైక్రో ఏటీఎంలతో సులభంగా డబ్బులు విత్‌డ్రా



లింగాపురం సొసైటీ సీఈఓకు మైక్రో ఏటీఎం అందజేత

కడప అగ్రికల్చర్: డబ్బుల కోసం ఖాతాదారులు బ్యాంకుకు వెళ్లకుండానే ఆధార్‌కార్డు లింక్ అయిన బ్యాంకు ఖాతా నుంచి వేలిముద్రతో మైక్రో ఏటీఎంల ద్వారా సులభంగా డబ్బులను డ్రా చేసుకోవచ్చని డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ అన్నారు. జిల్లాలోని లింగాపురం, తాళ్లప్రొద్దుటూరు, మైదుకూరు సొసైటీలలో మైక్రో ఏటీఎంలు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయా సొసైటీల సీఈఓలకు గురువారం కడప డీసీసీ బ్యాంకులో సీఈఓ చేతుల మీదుగా మైక్రో ఏటీఎం మిషన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బులు డ్రా చేసుకోవడానికి ఖాతాదారులుగానీ, రైతులుగానీ సంబంధిత బ్యాంకుల ఏటీఎం వద్దకు వెళ్లనవసరం లేదన్నారు. కార్డు ద్వారా, ఆధార్‌లింక్ అయితే వేలిముద్ర ద్వారా రూ. 10000 వరకు మైక్రో ఏటీఎం ద్వారా డబ్బులు డ్రా చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం ఖాతాదారులకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

• దళారీ వ్యవస్థకు మంగళం

రైతన్నకు అందలం



పులివెందుల మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన చీనీ కాయలు

నిద్రాహారాలు మాని శ్రమించిన రైతు కష్టం దళారులపాలవుతోంది. దిగుబడి చేతికి వచ్చాక సరైన ధరలు దక్కకపోతే శ్రమంతా వృధా అవుతోంది. ధరలుంటే దళారుల చేతివాటంతో నష్టపోతున్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం దళారుల దందాకు చెక్ పెట్టింది. కొనుగోలు కేంద్రం ద్వారా విక్రయాలు చేపడుతోంది. ట్రేడర్స్‌ను మార్కెట్‌కు రప్పించి, డిమాండ్‌కు తగ్గ ధర దక్కేలా చొరవ తీసుకుంది. దీంతో రైతన్న ప్రభుత్వంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కార్‌ను కీర్తిస్తోంది.

- హార్టికల్చర్ దిగుబడులకు ప్రభుత్వ మార్కెటింగ్
- పులివెందుల కేంద్రంగా 3,544 టన్నుల చీనీకాయల విక్రయం
- మధ్యదళారుల సూట్‌కు బ్రేక్
- నెలలో అన్నదాతకు 708టన్నులు ఆదా
- మదనపల్లె కేంద్రంగా టమాట రైతులకు భరోసా

సాక్షి ప్రతినిధి, కడప: 'వడ్డించేవారు మనోడైతే కడబంతిలో ఉన్నా కడుపు నిండుతోంది' ఇది ఒకప్పటి సామెత. దాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిజం చేస్తోంది. కష్టానికి తగ్గ దిగుబడి, దిగుబడికి తగ్గ ధరలు ఉండేలా సమతుల్యతను పాటిస్తోంది. హార్టికల్చర్ దిగుబడులు కొనుగోలు ద్వారా మధ్య దళారీ వ్యవస్థకు మంగళం పలికింది. రైతుకు రావాల్సిన ఆదాయం పక్కదారి పట్టకుండా కట్టడి చేస్తోంది. జిల్లాలో పులివెందుల కేంద్రంగా అక్టోబర్ 10న చీనీకాయలు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసింది. అక్టోబర్ 31 నాటికి 3,544 టన్నుల చీనీకాయలు రైతుల నుంచి ట్రేడర్లు కొనుగోలు చేశారు. అత్యధిక ధర రూ.45,300 పలికింది. ఇరుగు పొరుగు మార్కెట్ కంటే పులివెందుల కొనుగోలు కేంద్రంలో కాస్త మెరుగ్గా ధరలు పలుకుతున్నాయి. అందుకు కారణం నాణ్యమైన చీనీకాయలు ఉండడమే. ఇలా ధరలున్నా గతంలో సూట్ ద్వారా బహిరంగ దోపిడీ ఉండేది.

సూట్‌కు విధానానికి చెక్: రైతే రాజు అయితే కష్టనష్టాలు తెలుస్తాయి. తదనుగుణంగా నిర్ణయాలు తెరపైకి రానున్నాయి. అచ్చం అలాంటి విధంగానే హార్టికల్చర్ పంటల దిగుబడులు కొనుగోలు కేంద్రాలు వెలిశాయి. పచ్చి సరుకు ఎప్పటికప్పుడు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండడంతో దళారులు కూడబలుక్కొని మూకుమ్మడిగా అందినకాడికీ దోపిడీ చేసేవారు. 10 టన్నుల చీనీకాయలు కొనుగోలు చేయాలంటే, 2టన్నులు సూట్ ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేది. సూట్ ఇవ్వకుంటే ట్రేడర్స్ కొను గోలు చేసేందుకు ముందుకు రాకుండా పోయేవారు. ఈ పరిస్థితికి ప్రభుత్వం చెక్ పెట్టింది. మార్కెట్ కమిటీ ద్వారా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 20 రోజులల్లో 3,544 టన్నులు ట్రేడర్స్ కొనుగోలు చేశారు. అంటే 708 టన్నుల ఆదాయం రైతుల ధరికి చేరింది. సరాసరి ధరతో పోల్చుకుంటే సుమారు రూ.2కోట్లు పైబడి దళారుల చేతుల్లోకి వెళ్తున్న ఆదాయం అన్నదాతకు దక్కింది. జిల్లా వ్యాప్తంగా 67,648 హెక్టార్లల్లో చీనీ తోటలుంటే పులివెందుల, జమ్మలమడుగు, కమలాపురం, మైదుకూరు, బద్వేల్ నియోజకవర్గాల్లో అత్యధికంగా ఉన్నాయి. ఆయా రైతులు కొనుగోలు కేంద్రం ద్వారా విక్రయాలు చేపట్టి సద్వినియోగం చేసుకుంటున్నారు.

▶▶టమాటా రైతుకు బాసట



ధరలు పెరిగినప్పుడు వినియోగదారులకు, ధరలు లేక సతమతమవుతున్నప్పుడు రైతులను ఆదుకునేందుకు సీఎం వైఎస్ జగన్ సర్కార్ చర్యలు చేపట్టింది. మార్కెట్లో టమాట ధరలు కిలో రూ.2-3 మధ్య ఉన్న సమయంలో ప్రభుత్వం రంగంలోకి దిగి రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుంది. మార్కెటింగ్‌శాఖ దగ్గరుండి నాణ్యమైన టమాటానే కాదు.. కాస్త వినియోగానికి పనికొచ్చేలా ఉన్న వాటిని కొనుగోలు చేసింది. నాణ్యమైన టమాటాకు సైజును బట్టి కిలో రూ.12 నుంచి రూ.20వరకు ధర వచ్చేలా చేసింది. టమాటా ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వాహకులతో సమావేశమై రైతుల వద్ద నిల్వలు ఉండిపోయిన సరుకు అమ్ముడయ్యేలా చర్యలు తీసుకుంది. అలాగే ఈ ఏడాది జూన్, జూలైలో టమాటా ధరలు ఆకాశాన్నంటిన తరుణంలో రైతులు నష్టపోకుండా మదనపల్లె మార్కెట్‌లో బహిరంగ వేలంలో పాల్గొని వ్యాపారులతో సమానంగా ధరలు ఇచ్చి కొనుగోలు చేసింది. వాటిని రాష్ట్రంలోని రైతుబజార్లకు తరలించి కిలో రూ.50 చొప్పున సబ్సిడీ ధరలకు విక్రయించి, వినియోగదారులపై భారం పడకుండా చూసింది. అటు వినియోగదారుడికి ఇటు రైతుకు మధ్య సమతుల్యతను పాటిస్తూ తదనుగుంగా చర్యలు చేపట్టింది. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో దాదాపు 23,623 హెక్టార్లల్లో టమాటా సాగులో ఉంది. వీరికి మునుపెన్నడూ లేనివిధంగా ధరలు తగ్గినప్పుడు కూడా ప్రభుత్వం ముందుకు వచ్చి కొనుగోలు చేసింది.

చీనీ రైతులకు ఎంతో ఉపయోగం



పులివెందుల వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన చీనీ మార్కెట్ ద్వారా కొనుగోలు చేయడం రైతులకు ఎంతో ఉపయోగం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో చీనీ రైతులకు ఆర్థిక ప్రయోజనం దక్కుతోంది. దళారుల తీసుకుంటున్న సూట్ విధానం పూర్తిగా కనుమరుగైంది. –బలరామిరెడ్డి, నల్లపురెడ్డిపల్లె, పులివెందుల మండలం

టమాట సాగుకు ప్రోత్సాహకాలు



టమాటాకు మార్కెట్లో ధరలు తగ్గినా రైతుకు కనీస గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మరోవైపు పంట సాగుకు ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయం. మల్చింగ్ పేపర్‌కు, ప్లాస్టిక్ క్రేట్లకు సబ్సిడీ అందించడంతో పెట్టుబడి ఖర్చులు కొంత మేర తగ్గుతున్నాయి. – సుధాకరరెడ్డి, మండ్యంవారిపల్లె, నిమ్మనపల్లె మండలం

'బ్రీఫ్ కేస్'టీజర్ విడుదల



టీజర్‌ను విడుదల చేస్తున్న చిత్రం యూనిట్ సభ్యులు

ఓబులవారిపల్లె: మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బ్రీఫ్‌కేస్ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రీఫ్‌కేస్ సినిమా విజయం సాధించాలని, హీ హీరో, హీరోయిన్‌లు, చిత్రం యూనిట్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. గాదెల దళితవాడకు చెందిన సినిమా హీరో నరసింహులు బ్రీఫ్‌కేస్ సినిమాలో హీరోగా నటించగా, దివ్య కీర్తి హీరోయిన్‌గా నటించారు.

'సివిల్స్' అభ్యర్థులకు ప్రోత్సాహకాలు

రాయచోటిటౌన్: సివిల్స్ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులను ప్రోత్సహించేందుకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వం నగదు బహుమతిని ప్రకటించిందని అన్నమయ్య జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, వెనుకబడిన అభ్యర్థులు యుపీఎస్‌సీ ద్వారా నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలలో అర్హత సాధించిన వారికి రూ.1,00,000లు (రూ.లక్ష),అలాగే మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించిన అభ్యర్థులకు రూ.50 వేలు, ఆర్థికంగా నగదు ప్రోత్సాహకం కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'జగనన్నసివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. 2023వ సంవత్సరంలో నిర్వహించిన యుపీఎస్‌సీ ప్రిలిమినరీ పరీక్షలలో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ పథకానికి పొందేందుకు అర్హులని తెలిపారు. జివోఎంఎస్ నంబర్ 58 సాంఘిక సంక్షేమ (EDU-II శాఖ తేది 12.10.2023 ప్రకారం అర్హులైన అభ్యర్థులు Jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విధుల్లో అలసత్వం వద్దు

విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్. రమణ



సిబ్బందితో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్. రమణ

ఒంటిమిట్ట: విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎస్ఈ) ఎస్. రమణ అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయాన్ని అకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు అవసరాల కోసం సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలని ఆయన అన్నారు. కార్యాలయానికి సమయానికి రాకుండా నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో పెద్ద ఎత్తున విద్యుత్ అంతరాయాలు కల్గుతున్నాయని, క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యంగా వహిస్తున్నారని పిర్యాదులు ఉన్నాయన్నారు. తీరు మార్చుకోక పోతే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. డీఈ రాజశేఖర్‌రెడ్డి, ఏడీ మురళీధర్‌రెడ్డి, ఏఈ ఉదయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

టి-20 క్రికెట్ జట్టు ఎంపిక

కలకడ: అన్నమయ్య జిల్లా టి-20 క్రికెట్ జట్టును ఎంపిక చేయనున్నట్లు టి-20 క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంఘం ప్రధాన కార్యదర్శి కె.అద్వైత్ తెలిపారు. శనివారం ఉదయం 10గంటలకు కలకడ ఆదర్శపాఠశాల వెనక ఉన్న క్రీడాస్థలంలో ఎంపిక జరుగుతుందని తెలిపారు. టి-20 క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-16 ,అండర్-19, సీనియర్స్ విభాగంలో ఎంపిక జరుగుతుందని వివరించారు. ఇతర వివరాలకు 8328210181, 7995516403లలో సంప్రదించాలని కోరారు.

పద్ధతి మార్చుకోండి.. బుద్ధిగా ఉండండి






కౌన్సెలింగ్‌కు హాజరైనవారిని ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

- చెడు నడత కలిగిన వారికి ఇదే ఫైనల్ వార్నింగ్
- జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ హెచ్చరిక

కడప అర్బన్: గతంలో ఏం జరిగిందో నాకు తెలియదు.. పద్ధతి మార్చుకోండి.. ఇదే ఫైనల్ వార్నింగ్.. ఇకపై తప్పిదాలు చేస్తే తాట తీస్తా'అని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ చెడు నడత కలిగిన వారికి, ట్రబుల్ మాంగర్లను హెచ్చరించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో గురువారం కడప నగర శివార్లలోని డీటీసీలో కడప సబ్ డివిజన్ పరిధిలోని చెడు నడత కలిగిన వారికి, ట్రబుల్ మాంగర్స్ (సమస్యలు సృష్టించడానికి కారణమయ్యేవారు)కు ఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మీ కదలికలపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని గమనించి తమ ప్రవర్తనను మార్చుకోవాలన్నారు.

- ప్రతి వారం విధిగా పోలీసుస్టేషన్‌లో హాజరు వేయించుకోవాలన్నారు. ప్రజాజీవనానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే దండన తప్పదన్నారు. భవిష్యత్తులో ఎలాంటి చెడు పనులకు పాల్పడకుండా మీ బంధువుల తరపున, పెద్దల నుంచి పూచీ ఇస్తూ పోలీస్‌శాఖకు బాండ్లు ఇవ్వాలని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో కడప డిఎస్పీ ఎండీ షరీఫ్, ఫ్యాక్షన్‌జోన్ డీఎస్పీ ఈ. బాలస్వామిరెడ్డి, కడప సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.
- ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కడప, జమ్మలమడుగు, పులివెందుల, మైదుకూరు, ప్రొద్దుటూరు సబ్ డివిన్‌ల పరిధిలో ఆయా డీఎస్పీలు, సీఐలు కౌన్సెలింగ్ నిర్వహించారు. సద్బుద్ధితో జీవించాలని, అక్రమ కార్యకలాపాలు, సమస్యలు సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవిష్యత్తులో ఎలాంటి తప్పులు చేయమని భరోసా ఇస్తూ చెడు నడతకల వారి కుటుంబ పెద్ద లేదా బంధువులు పూచీ బాండ్లను ఇవ్వాలని పోలీస్ అధికారులు తెలిపారు.

సీస్‌కు సర్వం సిద్ధం



- నేడు 3,6,9 తరగతుల విద్యార్థులకు సామర్థ్య మదింపు పరీక్ష
- జిల్లావ్యాప్తంగా ముగిసిన ప్రాక్టీస్ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో నిర్వహించే సీస్(స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) సర్వే పరీక్షకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలోని 1361 పాఠశాలలకు సంబంధించి 3,6,9 తరగతులు చదివే 33690 మంది విద్యార్థులు నేడు(నవంబర్ 3వ తేదీన) పరీక్ష రాయనున్నారు. ఇందుకు సంబంధించిన పరీక్ష పేపర్లు జిల్లాకు చేరాయి. వీటిని ఆయా కాంప్లెక్స్‌ల ద్వారా పాఠశాలకు కూడా చేరవేశారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లను పూర్తయ్యాయి.

1499 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల నియామకం

సీస్ సర్వే పరీక్ష నిర్వహించేందుకు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని 1361 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసింది. విద్యార్థుల్లో అభ్యసన ఫలితాలు ఏ మేరకు ఉన్నాయో తెలుసుకునేందుకు నిర్వహించే సర్వేకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల నియామకం కూడా పూర్తి చేశారు. వీరితోపాటు మరో 68 మంది బ్లాక్ కో ఆర్డినేటర్లును కూడా నియమించారు. జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ , ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 1499 మంది విద్యార్థులను విద్యాశాఖ ఫీల్డ్ ఇన్వెస్టి గేటర్లుగా నియమించి వీరికి శిక్షణను కూడా పూర్తి చేశారు.

పర్యవేక్షలు వీరే...

జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణలో డీసీఈబీ సెక్రటరీ, సమగ్రశిక్ష ఏఎంఓ, డైట్ లెక్చరర్లు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించిన ప్రక్రియను పరిశీలిస్తారు.



ప్రాక్టీస్‌లో నిమగ్నమైన విద్యార్థులు

సర్వే నిర్వహించనున్న పాఠశాలలు:	1361
3వ తరగతిలో పరీక్షరాయనున్న వారు:	11102
6వ తరగతి లో :	11725
9వ తరగతిలో :	10863
3,6,9 తరగతులకు సంబంధించి మొత్తం విద్యార్థులు:	33690
ఇంగ్లిషు మీడియం విద్యార్థులు:	27377
తెలుగు మీడియం :	5871
ఉర్దూ మీడియం :	492
పరీక్షకు నియమించిన ఇన్విజిలేటర్లు:	1499

మండలస్థాయిలో ఎంఈఓ-1, ఎంఈఓ-2, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సర్వే పరీక్ష నిర్వహణ పర్యవేక్షిస్తారు.

పరీక్ష జరిగే విధానం..

సీస్ సర్వేలో భాగంగా మూడు, ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ఓఎంఆర్ విధానంలో ఉంటుంది. మూడు, ఆరు తరగతుల విద్యార్థులకు ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీపై పరీక్ష ఉంటుంది.6, 9వ తరగతి విద్యార్థులకు గతేడాది సిలబస్‌పై పరీక్ష ఉంటుంది. జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో ఉదయం 10.30 గంటలకు పరీక్షను ప్రారంభిస్తారు. మూడోతరగతి విద్యార్థులకు గంట, ఆరోతరగతివారికి గంట 15 నిమిషాలు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఒకటిన్నర గంట సమయాన్ని పరీక్ష రాయడానికి కేటాయిస్తారు. ప్రతి తర గతికి ఒక్కో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌ను నియమించారు. వీరితోపాటు హెచ్‌ఎంలు కూడా పర్యవేక్షించనున్నారు.

సామర్థ్యాల అంచనా కోసం...



సీస్ సర్వేలో భాగంగా నిర్వహించే పరీక్ష ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల అంచనా వేసేందుకు వీలవుతుంది. సర్వే ఫలితాలను బట్టి బోధన అభ్యసనాలను పెంపొందించేందుకు ప్రణాళికలను రూపొందించొచ్చు. జిల్లావ్యాప్తంగా 1361 స్కూళ్లలో 33690 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.
– అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి.

ఏర్పాట్లు పూర్తి...



సీస్ పరీక్షకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇందుకు సంబంధించిన ప్రశ్నపత్రాలు కూడా వచ్చాయి. పరీక్ష స్వేచ్ఛా వాతావరణంలో నిర్వహించాలి. ఉపాధ్యాయులు పిల్లలకు సహకారం అందించకూడదు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు, ప్రధానోపాధ్యాయులు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి వెళేందుకు అనుమతి ఉంటుంది. సీస్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి.
– ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

18వ శతాబ్దంనాటి విగ్రహం లభ్యం



18వ శతాబ్దం నాటి విగ్రహం

బ్రహ్మంగారిమఠం: మండలంలోని రేకలకుంట గ్రామంలో గురువారం 18వ శతాబ్దం నాటి పురాతన విగ్రహం బయటపడిందని చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ తెలిపారు. ఒక మహిళ తన ఎడమ చేయి వైపు ఓ చంటిబిడ్డకు చనుబాలు ఇస్తున్నట్లుగా ఉన్న ఈ విగ్రహం కూనపులి రాజానాయుడు అనే రైతు పొలంలో లభించిందన్నారు. విగ్రహం గురించి మైసూర్ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి తెలపగా 18వ శతాబ్దానికి చెందినదని ధృవీకరించారన్నారు. కాగా, ఈ విగ్రహం గురించి గ్రామంలో ఓ కథనం ప్రచారంలో ఉంది. దీని ప్రకారం అప్పట్లో పెద్ద బుచ్చయ్యనాయుడు, చిన్న బుచ్చయ్యనాయుడు అనే వ్యక్తులు చంటి బిడ్డను ఎత్తుకొని కురులు ఆరబోసుకొని వచ్చిన ఓ మహిళను బలాత్కారం చేయబోయారట. ఆమె వారి వంశం అభివృద్ధి చెందదని శాపం పెట్టిందని, తమను క్షమించమని వేడుకోగా ఓ వరం ఇచ్చిందట. తన ప్రతిమను ఏర్పాటు చేసుకొని పూజిస్తే మీ వంశాంకురం అభివృద్ధి చెందుతుందట.. ఈ విగ్రహం అదేనని అంటున్నారు.

క్లుప్తంగా

గాయపడిన వృద్ధుడి మృతి

కమలాపురం : కమలాపురం మండలం పందిళ్ల పల్లె ఎస్సీ కాలనీకి చెందిన కె.సుబ్బయ్య (65) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుధవారం రాత్రి సుబ్బయ్య పందిళ్లపల్లె క్రాస్‌ వద్ద రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు లారీ వెనుక చక్రాల కింద పడ్డాడు. ఈ ఘటనలో సుబ్బయ్య రెండు కాళ్లు నుజ్జునుజ్జు కావడంతో పాటు చేయికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సుబ్బయ్య మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. కాగా మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఎర్రగుంట్ల– తాడిపత్రి జాతీయ రహదారిపై కదిరివారిపల్లె గ్రామ క్రాస్‌ రోడ్డు ఐసీఎల్‌ మైన్స్‌ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. సీఐ ఈశ్వరయ్య గురువారం వివరాలు వెల్లడించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. మృతుడి వయసు సుమారు 40 నుంచి 45 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. ముస్లిం, దుదేకుల కులానికి చెందిన వ్యక్తిగా తెలుస్తోందన్నారు. కుడిచెయ్యి మణికట్టుపై కణితి ఉబ్బెతుగా ఉందన్నారు. ముఖం గుర్తు పట్టలేని విధంగా దెబ్బతిందన్నారు. మృతుడి ఆచూకీ వివరాలు తెలిస్తే.. ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. 9121100530 సెల్‌ నంబరుకు తెలియజేయాలని ఆయన కోరారు.

డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో జైలు

సంబేపల్లె : మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో ఒకరికి జైలు శిక్ష, ఇద్దరికి జరిమానా పడింది. మండల పరిధిలో డ్రంకన్‌ డ్రైవ్‌పై స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించి ముగ్గురిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ షరీఫ్‌ తెలిపారు. వారిలో ఒకరికి జైలు శిక్ష, ఇద్దరికి రూ.10500 చొప్పున జరిమానా విధిస్తూ రాయచోటి ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి మహమ్మద్‌ ఇష్రాత్‌ ఫాతిమా గురువారం తీర్పు చెప్పారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీ గాండ్లవంకకు చెందిన నాగభూషణం భార్య కె.సుజాత(34) కుటుంబ సమస్యలతో క్రిమి సంహారణ మందు తాగి ఆత్మహత్యకు గురువారం ప్రయత్నించింది. ఆమెను స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

17 కరువు మండలాల కింద ప్రతిపాదనలు

- ఖరీఫ్‌లో తీవ్ర వర్షపాత లోటు
- 25 మండలాల్లో 27 డ్రైస్పెల్స్‌
- రిజర్వాయర్‌లలో తగ్గిన నీటిమట్టం

నవంబర్‌ 2 తేదీ ఉదయం 8 గంటలకు ప్రాజెక్టుల పరిస్థితి

పేరు	సామర్థ్యం (టీఎంసీలు)	ఉన్నవి (టీఎంసీలు)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)
సీబీఆర్‌	10.229	4.839	0	55
గండికోట	26.850	16.430	0	5100
మైలవరం	6,500	2.668	3624	546
పైడిపాలెం	6.000	4.871	0	185
సర్వరాయ	3.060	0.698	0	30
వామికొండ	1.658	1.45	0	5
ఎస్‌ఆర్‌–1	2.135	0.297	0	10
ఎస్‌ఆర్‌–2	2.447	0.729	0	15
బ్రహ్మసాగర్‌	17.735	4.906	0	536

కడప సెవెన్‌రోడ్స్‌ : ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో 17 మండలాలను కరువు కింద ప్రకటించాలని జిల్లా యంత్రాంగం రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖకు ప్రతిపాదనలు పంపింది. దీనిపై ప్రభుత్వం నుంచి త్వరలో నిర్ణయం వెలువడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో మైలవరం, చాపాడు, ప్రొద్దుటూరు, కడప, చింతకొమ్మదిన్నె మండలాల్లో కరువు తీవ్రత అధికంగా ఉన్నట్లు గుర్తించారు. గోపవరం, ఖాజీపేట, జమ్మలమడుగు, వేముల, వీరపునాయునిపల్లె, కమలాపురం, అట్లూరు, ఒంటిమిట్ట, సిద్ధవటం, పెండ్లిమర్రి, వేంపల్లె, చక్రాయపేట మండలాలను మోస్తరుగా, మిగతా మండలాలను సాధారణం కింద గుర్తించారు.

సూచికలు

వర్షపాత లోటు, పొడి వాతావరణం (డ్రైస్పెల్స్‌ మ్యాండేటరీ ఇండికేటర్స్‌).. కరువు కింద ప్రకటించడానికి ఈ రెండు తప్పనిసరిగా వర్తించాలి. ప్రభావ సూచిక (ఇంపాక్ట్‌ ఇండికేటర్స్‌) కింద పంటల సాధారణ సాగు, మాయిశ్చర్‌ అడెక్వసీ ఇండెక్స్‌, నార్మలైజ్డ్‌ డిఫరెన్షియల్‌ వెజిటేషన్‌ ఇండెక్స్‌, రిజర్వాయర్‌ స్టోరేజ్‌ ఇండెక్స్‌లను తీసుకుంటారు. నైరుతి రుతుపవనాల సమయంలో అంటే జూన్‌ 1 నుంచి సెప్టెంబర్‌ 30 వరకు జిల్లా సాధారణ వర్షపాతం 405 మిల్లీమీటర్లు కాగా 349 మిల్లీ మీటర్లు కురిసింది. అంటే మైనస్‌ 13.9 మిల్లీమీటర్లు నమోదైంది. జూన్‌లో మైనస్‌ 43.8 జూలైలో మైనస్‌ 27.3, ఆగష్టులో మైనస్‌ 61.5 మిల్లీమీటర్లు, అక్టోబర్‌ మైనస్‌ 96.8 వర్షపాతం నమోదైంది. అయితే సెప్టెంబర్‌లో 62.5 మిల్లీమీటర్ల వర్షపాతం అధికంగా కురవడంతో ఖరీఫ్‌లో మొత్తం సాధారణ వర్షపాతంలో కేవలం మైనస్‌ 13.9 మి.మీగా పరిగణించాల్సి వస్తోంది. ఇక జూన్‌ 4వ తేదీ నుంచి సెప్టెంబర్‌ 30వ తేదీ వరకు 25 మండలాల్లో 27 డ్రైస్పెల్స్‌ చోటు చేసుకున్నాయి. వరుసగా 21 రోజులు వర్షమే లేకపోతే దాని ఒక డ్రైస్పెల్‌గా పరిగణిస్తారు. రెండు డ్రైస్పెల్స్‌ సంభవించిన మండలాలు కూడా ఇందులో ఉన్నాయి.

రిజర్వాయర్‌లలో తగ్గిన నీటిమట్టం

జిల్లాలోని 6 రిజర్వాయర్‌లలో సాధారణ నీటి నిల్వ సామర్థ్యం 54 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 31 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. డెడ్‌ స్టోరేజీ కింద 4.72 టీఎంసీలు పోను వినియోగానికి అందుబాటులో ఉన్నది 24.848 టీఎంసీలు, నవంబర్‌ నుంచి జనవరి వరకు ఖరీఫ్‌ బ్యాలెన్స్‌ సాగు నీరు 0.44, తాగునీటి అవసరాలకు 2.30, పారిశ్రామిక అవసరాలకు 1.10, రబీకి (డిసెంబర్‌–మార్చి) 8.470 అంటే మొత్తం 12.314 టీఎంసీలు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు.

పెన్నా నదికి నీటి విడుదల



పెన్నా నదికి నీటిని విడుదల చేస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్‌ (మైలవరం) : మైలవరం జలాశయం నుంచి పెన్నా నదిలోకి 200 క్యూసెక్కుల నీటిని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి అధికారులతో కలిసి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా నది జలాలు గండికోట జలాశయానికి తెచ్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డికి దక్కుతుందని అన్నారు. జిల్లా ప్రజలను దృష్టిలో పెట్టుకొని శ్రీశైలం ప్రాజెక్ట్‌ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌ ద్వారా కృష్ణా జలాలను గండికోటకు తెచ్చారని పేర్కొన్నారు. పెన్నా నది పరీవాహక ప్రాంతాల ప్రజలు, రైతుల తాగు, సాగు అవసరాల దృష్ట్యా ప్రస్తుతం నీరు వదలడం జరిగిందన్నారు. కమలాపురం నియోజకవర్గంలోని ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వరకు నీరు వచ్చి.. కేసీ కెనాల్‌ ద్వారా ఆయకట్టు పొలాలకు అందుతుందన్నారు. గండికోట నుంచి మైలవరం జలాశయానికి 3 టీఎంసీల నీటిని విడుదల చేయటకు అధికారులు అనుమతులు ఇచ్చారన్నారు. ప్రస్తుతం మైలవరం జలాశయంలో 2.66 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. అలాగే మైలవరం ఉత్తర కాలువ ద్వారా రోజూ 230 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. దీంతో మైలవరం, పెద్దముడియం, రాజుపాళెం, ప్రొద్దుటూరు మండలాల రైతులకు మేలు జరుగుతుందన్నారు. దక్షిణ కాలువ ద్వారా 200 క్యూసెక్కుల నీటిని సాగు, తాగు నీటి అవసరాలకు వదలడం జరిగిందని తెలియజేశారు. కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మైలవరం జలాశయం అధికారులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ డి.మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్‌



పట్టుకున్న గంజాయి, నిందితులతో డీఎస్పీ, సీఐ

ప్రొద్దుటూరు క్రైం : కొంత కాలంగా గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని త్రీ టౌన్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. వారి వద్ద నుంచి 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఇన్‌చార్జి డీఎస్పీ వంశీధర్‌గౌడ్‌ గురువారం వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి గ్రామానికి చెందిన సింగం సుబ్బారావు, ప్రొద్దుటూరులోని ఆచార్ల కాలనీకి చెందిన కుమ్మరి చిన్న యల్లయ్య, నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన పాలగోత్రం సుబ్బరాయుడు కలిసి కొంత కాలం నుంచి ప్రొద్దుటూరులో గంజాయి విక్రయించేవారు. స్థానికంగా విక్రయించడంతోపాటు ఇతర ప్రాంతాలకు కూడా అక్రమ రవాణా చేసేవారు. ఈ క్రమంలో ముగ్గురు కలిసి కొర్రపాడు రోడ్డులోని భగత్‌సింగ్‌ కాలనీలో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో.. త్రీ టౌన్‌ సీఐ వెంకటరమణ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ముగ్గురిని అరెస్ట్‌ చేసి వారి వద్ద ఉన్న 20 కిలోల గంజాయి, కారు, మూడు సెల్‌ఫోన్లు, రూ. 5950 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. దాడుల్లో స్పెషల్‌ ఇన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో ఇన్‌స్పెక్టర్‌ ఈ మోహన్‌రెడ్డి, త్రీ టౌన్‌ ఎస్‌ఐ బాల అంకయ్య, హెడ్‌కానిస్టేబుల్‌ జీ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు కే లక్ష్మీకాంత్‌రెడ్డి, బీ శివానంద, ఆర్‌ వీరాంజిలు పాల్గొన్నారు. పెద్ద మొత్తంలో గంజాయిని సీజ్‌ చేసి నిందితులను పట్టుకున్న త్రీ టౌన్‌ పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్‌ అభినందించారు.

పంటల రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

- వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా అవసరం
- జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు



కడప అగ్రికల్చర్‌ : జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల పలు చోట్ల వివిధ పంటలు ఎండుముఖం పట్టాయి. కావున రైతులు రక్షణ చర్యలు పాటించి పంట నష్టాన్ని తగ్గించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు 'సాక్షి' ద్వారా రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లాలో సాగు చేసిన వివిధ పంటల్లో ఎండ బెట్టను తగ్గించుటకు పొటాషియం నైట్రేట్‌ను 6–8 గ్రాముల లీటరు నీటికి లేదా 13–0–45(ముటి–కె 6–8 గ్రాములు లీటర్‌ నీటికి లేదా 19:19:19ని 8–10 గ్రాములు లీటరు నీటికి కలిపి వారానికి రెండు సార్లు పంటలపై పిచికారి చేసుకోవాలని చెప్పారు. పంటలో మొక్కల సాళ్ల మధ్యలో హారోవింగ్‌ చేయడం ద్వారా భూమిలో కొంత వరకు తేమను పట్టుకునే సామర్థ్యం పెంచేలా చేస్తుందన్నారు. దీని ద్వారా మొక్కలు కొన్ని రోజులు బెట్టను తట్టుకునే పరిస్థితి ఉంటుందన్నారు. పొలంలో పూర్తిగా ఎండిపోయిన మొక్కలను తీసివేయడం వల్ల కూడా కొంత వరకు మిగిలిన మొక్కలు బెట్టను తట్టుకునే పరిస్థితి ఉంటుందన్నారు. ఉద్యాన పంటల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం ద్వారా కొంత వరకు బెట్టను తగ్గించుకోవచ్చన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల వివిధ పంటల్లో రసం పీల్చే పురుగుల బెడద, తెగుళ్ల వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. కావున రైతులు తగిన రక్షణ చర్యలు పాటించి పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చన్నారు.

వరి

వరి పంటల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల సుడిదోమ ఉధృతి పెరుగుతుంది. దీనిని నివారించుటకు డినోటిఫ్యురాన్‌ 0.4 గ్రాములు లీటర్‌ నీటికి లేదా పైమెట్రొజెన్‌ 0.6 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. పాయు పొడ తెగులు, కాండం కుళ్లు శిలీంధ్ర తెగులు వచ్చే అవకాశం కూడా ఉంటుంది. దీని నివారణకు హెక్సాకొనజోల్‌ 2 మిల్లీలీటర్లను లీటర్‌ నీటికి లేదా ప్రొపికోనజోల్‌ 1 మిల్లీమీటర్‌ను లీటర్‌ నీటికి పిచికారి చేసుకోవాలి

వేరుశనగ

వేరుశనగ పంటను వివిధ తెగుళ్లు ఆశించే అవకాశం ఉంది. వీటి నివారణకు హెక్సాకోనజోల్‌ 2 మిల్లీలీటర్లను లీటర్‌ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

మినుము

మినుము పంటలో రసం పీల్చే పురుగులు వచ్చే అవకాశం ఉంది. దీని నివారణకు డిఫెండిసెరాన్‌ 1 గ్రాము ప్లస్‌ హెక్సాకోనజోల్‌ 2 మిల్లీ లీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

జొన్న

జొన్న పంటలో మొవ్వ ఈగ/మొవ్వ తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు కార్బోఫ్యూరాన్‌ 3G గుళికలను ఎకరాకు 6–8 కేజీల చొప్పున వేసుకోవాలి.

పత్తి

పత్తి పంటలో రసం పీల్చే పురుగు, గులాబీ రంగు పురుగుల బెడద ఉంటుంది. రసం పీల్చే పురుగులను నివారించుటకు పసుపు లేదా నీలం రంగు జిగురు అట్టను ఎకరానికి 10 చొప్పున పొలంలో పెట్టుకోవాలి. డిఫెన్థిరాన్‌ 1 గ్రాము లీటరు నీటికి లేదా ఇమిడాక్లోప్రైడ్‌ 1 మిల్లీలీటర్‌కు 20 ఎంఎల్‌ నీటిని కలిపి కాండానికి పూతలాగా వేసుకోవాలి. అలాగే గులాబి రంగు పురుగును నివారించడానికి లింగాకర్షక బుట్టలు ఎకరాకు 10 చొప్పున పెట్టుకోవాలి. పురుగు ఆశించిన కాయలను తీసివేయాలి.

మిరప

మిరప పంటలో రసం పీల్చే పురుగులను నివారించుటకు డిఫెంథ్యూరాన్‌ 1 గ్రాము ప్లస్‌ హెక్సాకోనజోల్‌ 1 మిల్లీలీటర్‌ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు సూచించారు.

మైనింగ్‌దారులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న విజిలెన్స్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారి మాసుంబాషా

కడప కోటిరెడ్డి సర్కిల్‌ : వివిధ రకాల లీజుదారులు, స్టోన్‌ క్రషర్‌, మైనింగ్‌ క్వారీయింగ్‌ యజమానులు, మినరల్‌ డీలర్లు రాష్ట్ర ప్రభుత్వం సూచించిన నిబంధనలను పాటించాలని విజిలెన్స్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారి షేక్‌ మాసుంబాషా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశపు హాల్‌లో మైన్స్‌ అండ్‌ జియాలజీ అధికారులతో విజిలెన్స్‌ అవగాహన వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి లీజుదారులు లీజు కాల పరిమితులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. చిన్నారులు, యువత, వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు రంగం వారికి విజిలెన్స్‌పై అవగాహన కల్పించేందుకు కడపకు చెందిన విజిలెన్స్‌ విభాగం వారు వివిధ రకాలైన కార్యక్రమాలను అక్టోబర్‌ 30 నుంచి నవంబర్‌ 5 వరకు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్‌, మైనింగ్‌ అధికారులు ఎ.ఇదురు బాషా, శ్రీనివాసులు, బాలగంగాధరరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్‌ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 105 కుటుంబాల చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన కుటుంబాలతో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ

బద్వేలు అర్బన్‌ : మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో గల ఐలమ్మ కాలనీలో వెంకటరామయ్య, ఓబయ్య ఆధ్వర్యంలో టీడీపీ, సీపీఎం, సీపీఐలకు చెందిన 105 కుటుంబాలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ కులం, మతం, పార్టీ చూడకుండా అన్ని వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషితో ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపు వస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 2024 ఎన్నికల్లో మరోసారి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గెలిస్తేనే పేదలకు మరింత మేలు జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలను కేవలం ఓటుబ్యాంకుగా మాత్రమే చూశారని, జగనన్న మాత్రం సామాజిక సాధికారత పేరుతో ఆయా వర్గాలకు రాజకీయంగా, ఆర్థికంగా మేలు చేస్తున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారంతా సైనికుల్లా పని చేసి మరోసారి బద్వేలులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ రాజగోపాల్‌రెడ్డి, పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్‌ సుందర్‌రామిరెడ్డి, మున్సిపల్‌ వైస్‌చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, మాజీ ఎంపీపీలు వెంకటేశ్వర్‌రెడ్డి, పోలిరెడ్డి, మండల కన్వీనర్‌ మల్లేశ్వర్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు కేశవరెడ్డి, పుత్తాశ్రీరాములు, శంకర్‌రెడ్డి, స్థానిక నాయకులు నాయబ్‌, జ్యోతి, సిద్దమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

REAL ESTATE

PLOT FOR SALE

■ గేటెడ్‌ కమ్యూనిటీ వెంచర్ల నందు ప్లాట్లు (30X50 41 అం.) అం. రూ. 9,000మె. SQFT రూ.250 ప్రతి కస్టమర్‌కి బంగారం 1 గ్రా. నుంచి 20 గ్రా. ల ఉచిత బహుమతి కలదు. కె.వెంకటాద్రి,M.D, 9908537563. [T-4698]

SERVICE

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్‌ బ్యాంక్స్‌ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్‌ క్యాష్‌ / షిఫ్టింగ్‌ (రిటైర్డ్‌ పోలీస్‌ డిపార్ట్‌మెంట్‌) గోల్డ్‌ట్రేడింగ్‌ కం. ఫోన్‌ : 73821 14647 [V- 5951]

CHANGE OF NAME

■ I SHAIK ANWAR BASHA (OLD NAME) IN MY SON PASSPORT D.No. 11/243, AMEENPEER ROAD, KADAPA CITY, YSR DIST, AP. CHANGE MY NAME AS SHAIK DHAVUBHAI ANWAR BASHA (NEW NAME) S/o. SHAIK MAHABOOB HUSSAIN. [C-1263380]

BUSINESS OFFER

■ ప్లాస్టిక్‌ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్‌ విలువలతో తయారవుతున్న బయోడిగ్రేడబుల్‌ కవర్లను మార్కెటింగ్‌ చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్‌, డీలర్లు మరియు మార్కెటింగ్‌ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9281159721, 8919551629 [H-788343]

HEALTH CARE

■ అన్ని రకముల సెక్స్‌ సమస్యలకు హస్తప్రయోగం, నరాల బలహీనత, సంభోగశక్తి తగ్గుట, అంగము చిన్నది అగుట, శీఘ్రస్ఖలనం, గనేరియా, సిఫిలిస్‌, మొలల నొప్పులు, కీళ్ల నొప్పులు, గ్యాస్‌ ట్రబుల్‌, ఆకలి లేకపోవడం, మెం వ్యాధులకు, 100% సైడ్‌ ఎఫెక్ట్‌ లేని ఆయుర్వేద వైద్యమే పరిష్కారం. ఉబ్బసం, ఆయాసం, దగ్గు, ఆస్తమా, డస్ట్‌ అలర్జీ, జలుబు, తుమ్ములు, హిస్టోప్లీయోలకు పర్మినెంట్‌ చికిత్స కలదు. హరి క్లినిక్‌: 9246941558. [C-1263386]

WANTED

■ Livgard & goodyear బ్యాటరీ డిస్ట్రిబ్యూటర్‌ నందు పనిచేయుటకు మార్కెటింగ్‌ ఎగ్జిక్యూటివ్స్‌ & హెల్పర్స్‌ కావలెను. జీతం అనుభవంను బట్టి, లోకేషన్స్‌: కడప, ప్రొద్దుటూరు. సంప్ర: 8309036367, 9885324828. [C-1263377]

■ స్కూల్‌ బస్సు డ్రైవర్‌, వార్డన్‌, క్లర్క్‌ కమ్‌ కంప్యూటర్‌ ఆపరేటర్‌, గణితం టీచర్‌, ఆయాలు కావలెను. విద్యార్హత, ఆసక్తి గలవారు సం॥ 9966006758 [C-1263379]

■ కడప శంకరాపురం TVS షోరూం నందు పనిచేయుటకు Telecallers (F) కావలెను. అర్హత: Inter/ Degree, ఆకర్షణీయమైన జీతం కలదు. 7799994716, 7799994718. [C-1263381]

■ దియాస్‌ స్లిమ్మింగ్‌ క్లినిక్‌ నందు పని చేయుటకు సిబ్బంది కావలెను. Q: BPT /డిగ్రీ /ఇంటర్‌ /10th పాస్‌ ఐన వారు అర్హులు. అడ్రెస్‌ : సంధ్య సర్కిల్‌. కడప. Ph: 8686018602. [C-1263383]

■ WANTED TEACHERS are required to teach Primary Classes 1 to 5th and Incharge. 9705411651, 7981288008. [C-1187980]

■ మా ఆఫీసు న్యూ బ్రాంచ్‌ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌ టైమ్‌ / ఫుల్‌టైమ్‌ వర్క్‌ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [M-1221799]

■ ప్రొద్దుటూరు నందు గల షిరిడిసాయి స్వీట్స్‌ షాపు నందు పనిచేయుటకు 1) సేల్స్‌–బిల్లింగ్‌ కొరకు మహిళలు కావలెను. అర్హత: 10th పాస్‌, 2) అకౌంటెంట్‌ దగ్గర కనీసం 3 సం॥లు పనిచేసిన అనుభవం గల అకౌంటెంట్‌ మహిళ కావలెను. విద్యార్హత : ఇంటర్‌, ఆపైన + స్పీడ్‌ టైపింగ్‌. ఇంటర్వ్యూ : 06–11–2023. ఫోన్‌ : 7396778592, 7330974588. [A-776939]

■ WANTED OPERATION THEATER ASSITENTS Qualification : Graduation, Age: 21 to 27 years Male, Kadapa, Local Candidates Only. 9885218629, 8437437044. [C-1263382]

■ సిమెంట్‌ ఫ్యాక్టరీలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్‌ కావలెను. జీతం: 16000, ఆది తక్కువ రేటులో భోజనం, Age : 22-45 సం॥ వరకు సెల్‌ : 9052124024, 8341389975 [Y-784388]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్‌ కావలెను. జీతం: 15000 - 40000/-, ఫ్రీ రూమ్‌+భోజనం. HYD, Ph: 7995984445 [HA-809]

■ త్రివేణి హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. Ph: 9848571888/9640400073 [HA-794]

■ Wanted M.G.Brothers MF (Tafe) ట్రాక్టర్‌ Show Room చిత్తూరు, వి.కోట, కుప్పం, మదనపల్లె, పీలేరు నందు పనిచేయుటకు Vehicles Sales Executive's, సర్వీస్‌ Supervisors మరియు మెకానిక్స్‌ కావలెను. ✆ 9133390990, 9848877473. [T-2372]

■ Wanted Drivers, Electricians, Plumbers, Office Attenders. Contact : Sri Mathrudevi Viswashanthi Ashram, Penchalakona, Rapur Mandal, SPSR Nellore(Dt.), Cell: 94943 00666. [N-1205944]

■ Wanted Male Receptionists, Super visors, Accountants & Clerks. Contact: Sri Mathrudevi Viswshanthi Ashram, Penchala kona, Rapur Mandal, SPSR Nellore(Dt.), Email : resumetosmvatrust12@gmail.com, Cell: 97051 86006. [N-1205945]

■ రామకృష్ణ గ్రూపు, (AP No.1) VJA, HYD శ్రీమంతులఇళ్లలో వృద్ధుల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్‌ కొరకు వర్కర్స్‌ కావలెను / 24x7 పంపగలము. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్‌ ✆ 91608 91122, 92814 52838 [B-1206459]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య వివాదం

ఒంటిమిట్ట : మండల పరిధి తప్పెటవారిపల్లెలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఎంఈవో వెంకట సుబ్బయ్య తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హెచ్‌ఎం నారాయణరెడ్డిపై ఉపాధ్యాయులు పాలెం మహేష్‌బాబు, మరో ఉపాధ్యాయుడు కలిసి డీఈవో రాఘవరెడ్డికి పరీక్షల్లో సమాధానం షీట్‌ కోసం విద్యార్థుల నుంచి నగదు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. అదే విధంగా హెచ్‌ఎం కూడా పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు సమయానికి రావడం లేదని డీఈవోకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి, రిపోర్టు ఇవ్వాల్సిందిగా డీఈవో ఆదేశించారని ఎంఈవో తెలిపారు.

అథ్లెటిక్స్‌లో జిల్లా స్థాయికి ఎంపిక



కన్నెమడుగు క్రీడాకారులతో పీడీ ఖాదర్‌బాషా

తంబళ్లపల్లె : నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్‌ పోటీలలో కన్నెమడుగు, తంబళ్లపల్లె ఎస్సీ బాలుర రెసిడెన్షియల్‌ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఖాదర్‌బాషా, పీఈటీ దేశ్‌ముఖ్‌ తెలిపారు. గురువారం ములకలచెరువు మండలం దేవులచెరువు ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి పోటీలు జరిగాయి. కన్నెమడుగు పాఠశాల విద్యార్థిని స్ఫూర్తి ట్రిపుల్‌జంప్‌, సుమిత్ర లాంగ్‌జంప్‌, మనోజ్‌కుమార్‌ 1500మీటర్ల పరుగుపందెం, జావలెన్‌త్రో, శివకుమార్‌ 800 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచారు. ఎస్సీ గురుకుల విద్యార్థులు రెడ్డెప్పనాయక్‌ అండర్‌–17 హైజంప్‌లో మొదటి స్థానం, సంతోష్‌ ట్రిపుల్‌ జంప్‌లో ద్వితీయ స్థానం, అండర్‌–17 200 మీటర్ల పరుగుపందెంలో సంతోష్‌ నాయక్‌ మొదటి స్థానం, అండర్‌ –14 హైజంప్‌, హైజంప్‌, శాట్‌పుట్‌, 200 మీటర్ల పరుగుపందెంలో నిరంజన్‌ ప్రతిభ చాటి మొదటి స్థానంలో నిలిచారు. అండర్‌–14 పరుగుపందెంలో నాగేంద్రబాబు, అండర్‌–14 శాట్‌పుట్‌లో గణేష్‌ ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరు శనివారం తిరుపతిలో జరిగే జిల్లా స్థాయి పోటీలో పాల్గొంటారన్నారు. విద్యార్థులను ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్‌ఎం మదన్మోహన్‌, ప్రిన్సిపాల్‌ క్రిష్ణమూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

తమిళనాడు వలసకూలీలకు విముక్తి

మదనపల్లె : పొట్ట కూటి కోసం ఇతర రాష్ట్రానికి వచ్చారు. ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను చూసి వస్తామన్నా.. యజమాని పంపలేదు. ఈ పరిస్థితిని ఎదుర్కొన్న తమళనాడు వలస కూలీలకు అధికారుల చొరవతో విముక్తి లభించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మొలకలదిన్నెకు చెందిన వేణు కొన్నేళ్లుగా పట్టణ పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాల రాతిగుట్టల్లో అనధికారికంగా రాళ్ల కొట్టే పని చేయిస్తున్నాడు. కూలీలకు ముందుగా అడ్వాన్సులు ఇచ్చి వారితో పని చేయించుకుంటూ, కూలి డబ్బుల్లో అడ్వాన్సు జమ చేసుకునేవాడు. ఈక్రమంలో తమిళనాడు తిరువణ్ణామలైకు చెందిన చంద్రశేఖర్‌, రామన్‌, రామకృష్ణన్‌తోపాటు మరో ఐదుగురికి రూ.1.20 లక్షల వరకు అడ్వాన్సుగా ఇచ్చి మదనపల్లెకు తీసుకువచ్చి మొలకలదిన్నెలో వసతి కల్పించాడు. వారితో పని చేయించుకుని, కూలి చెల్లిస్తూ వచ్చాడు. ఇటీవల వీరు తమ ఊరికి వెళ్లి, వస్తామని చెప్పడంతో.. తన వద్ద తీసుకున్న అడ్వాన్సు డబ్బులు ఇవ్వాలని తెలిపాడు. కూలీలుగా పని చేసుకునే తాము అంత డబ్బులు చెల్లించలేమని, ఇంటికి వెళ్లి వెంటనే వస్తామని చెప్పినా వినలేదు. మిమ్మల్ని నమ్మి ఎలా పంపించాలి, డబ్బులు ఇచ్చేంత వరకు వెళ్లేందుకు వీలులేదని తెగేసి చెప్పాడు. దీంతో వారు ఇక్కడే ఉండిపోయారు. వీరిలో ఒక కార్మికుడు రెండు రోజుల కిందట మొలకలదిన్నె నుంచి తప్పించుకుని, తమిళనాడులోని తిరువణ్ణామలైకు చేరుకున్నాడు. అక్కడి కలెక్టర్‌ను కలిసి, తమ స్నేహితులు అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం మొలకలదిన్నె వద్ద బందీలుగా ఉన్నారని, ఇళ్లకు వెళతామని వేడుకున్నా పంపకుండా ఉంచేశారని ఫిర్యాదు చేశాడు. దీంతో అక్కడి కలెక్టర్‌ అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ గిరీషాకు సమాచారం ఇచ్చారు. దీనిపై విచారించి నివేదిక ఇవ్వాలని ఆర్డీఓ ఎం.ఎస్‌.మురళీని ఆదేశించడంతో ఆయనతోపాటు డీఎస్పీ కేశప్ప, తహసీల్దార్‌ మహబూబ్‌చాంద్‌ క్షేత్ర స్థాయిలోకి వెళ్లి విచారణ చేశారు. బాధితులు తాము అడ్వాన్సు తీసుకున్న విషయం వాస్తవమేనని, ఇంటికి వెళతామంటే అడ్వాన్సు చెల్లించాలని, అప్పటి వరకు పంపబోమని చెప్పడంతో ఇక్కడే ఉండిపోయామని తెలిపారు. కూలీలతో రాళ్లు కొట్టిస్తున్న వేణును విచారణ చేశారు. ప్రభుత్వస్థలాల్లో అనుమతి లేకుండా రాళ్లు కొట్టిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రిమినల్‌ కేసులు పెడతామని హెచ్చరించారు. తర్వాత కార్మికుల వద్ద వాంగ్మూలం నమోదు చేసుకుని, ప్రయాణానికి చార్జీ ఖర్చులను ఇచ్చి పంపారు.

ప్రాణాలు కాపాడిన పోలీసులకు అవార్డులు



పోలీసులకు అవార్డు అందజేసి అభినందిస్తున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్‌ కౌశల్‌

కడప అర్బన్‌ : పోలీసు సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో ఇటీవల ప్రతివారం జిల్లా ఎస్పీ సిద్దార్థ్‌ కౌశల్‌ అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి 'వీక్లీ బెస్ట్‌ పెర్ఫార్మన్స్‌ అవార్డు' ను అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ముగ్గురు పోలీసు సిబ్బందిని ఎంపిక చేసి 'వీక్లీ పెర్ఫార్మన్స్‌ అవార్డు'లో భాగంగా కడపలోని జిల్లా పోలీస్‌ కార్యాలయంలో నగదు రివార్డుతోపాటు, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. కడప ఒన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో రైల్వేస్టేషన్‌ సమీపంలో పట్టాలపై పడి ఆత్మహత్యాయత్నం చేసుకోబోతున్న రాయచోటికి చెందిన ఓ యువజంటను సమయస్ఫూర్తితో వ్యవహరించి, కౌన్సెలింగ్‌ ఇచ్చి ఇటీవల పోలీసులు రక్షించారు. సమాచారం అందుకున్న తక్షణమే స్పందించి ఇద్దరి ప్రాణాలను కాపాడి పోలీస్‌ శాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింప చేసిన స్పెషల్‌ బ్రాంచ్‌ హెడ్‌కానిస్టేబుల్‌ ఎ.ప్రభు(ఎస్‌బీహెచ్‌సీ 1818), బ్లూకోల్ట్స్‌ హెడ్‌కానిస్టేబుల్‌ ఆనంద్‌ (హెచ్‌సీ 2008), స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ శ్రీనివాసులు (హెచ్‌సీ 1233)లను జిల్లా ఎస్పీ అభినందించారు.

జిల్లా పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు

కడప అర్బన్‌ : రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులు ఉత్తమ పోలీస్‌ సేవాపతకాలు, సేవా పతకాల జాబితాను ప్రకటించారు. వైఎస్‌ఆర్‌ జిల్లాలోని పోలీసు యంత్రాంగంలో పని చేస్తున్న వారిలో ఉత్తమ సేవాపతకాన్ని డీసీఆర్‌బీ ఏఎస్‌ఐ శ్రీపతి రామచంద్రరాజు (ఏఆర్‌ ఎస్‌ఐ 1443)కు ప్రకటించారు.

11వ బెటాలియన్‌లో ఏఆర్‌ఎస్‌ఐ (132) ఉత్తమ పోలీస్‌ సేవాపతకం

పోలీసు సేవా పతకాలను పోలీస్‌ 11వ బెటాలియన్‌లో ఎస్‌.రామకృష్ణ (ఆర్‌ఎస్‌ఐ), కడపలోని డీసీఆర్‌బీలో మోతుకూరి సురేష్‌బాబు, శ్రీరాముల సుబ్బన్న, యాసాని శ్రీనివాసులు, పంగా ఓబులేసు, కె.మార్క్‌, ఎల్‌సీకే చారికి పోలీసు సేవా పతకాలను ప్రకటించారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
3-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	490	64,081
నిఫ్టీ ▲	144	19,133

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తెలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	13,260	▲ 199
డోజోన్స్	33,721	▲ 446
ఎఫ్‌టీఎస్ఈ 100	7,447	▲ 104
డాక్స్	15,144	▲ 220
షాంఘై	3,009	▲ 14
నికాయ్	31,950	▲ 348

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,092	▲ 80
బంగారం (99.5 స్వచ్ఛత)	60,847	▲ 79
వెండి (కిలో)	71,684	▲ 700

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.49	84.26
£	బ్రిటన్ పౌండ్	99.73	101.94
€	యూరో	86.78	89.19
¥	జపాన్ ఎన్ (100)	54.27	55.87
AUS$	ఆస్ట్రేలియా డాలర్	51.63	54.39
S$	సింగపూర్ డాలర్	59.12	60.98
SAR	సౌదీ రియాల్	21.23	22.86
UAE D	యూఏఈ దిర్హామ్	21.87	23.49
¥	చైనా యువాన్	10.23	12.29

పోస్ట్ ద్వారా 2,000 నోట్ల మార్పిడి

బ్యాంక్ అకౌంట్లలో డబ్బు జమ



న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రాంతీయ కార్యాలయాలకు దూరంగా ఉండే ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2,000 నోట్లు మార్చుకోవడానికి సులభతరమైన విధానం అమలవుతోంది. పోస్ట్ ద్వారా ఈ మేరకు ప్రజలు సేవలు పొందవచ్చని ఇప్పటికే ప్రకటించిన ఆర్‌బీఐ ఉన్నతాధికారులు ఇందుకు వీలైన ప్రక్రియపై ప్రచారాన్ని చేపట్టారు. ఇన్సూర్డ్ పోస్ట్ లేదా టీఎల్ఆర్ (3 అంచెల రక్షణ) కవర్‌ను వినియోగించుకుని సురక్షితమైన మార్గంలో రూ.2,000 నోట్లు మార్చుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ విధానంలో పెద్ద నోట్ల మార్పిడికి సంబంధించిన డబ్బు సంబంధిత వినియోగదారు బ్యాంక్ ఖాతాల్లో జమవుతుంది. ''కస్టమర్‌లు రూ. 2,000 నోట్ల మార్పునకు సంబంధించిన డబ్బు తమ ఖాతాలో అత్యంత సురక్షితమైన పద్ధతిలో ప్రత్యక్షంగా క్రెడిట్ కావడానికి వీలుగా ఇన్సూర్డ్ పోస్ట్‌ను వినియోగించుకోవాలని ప్రోత్సహిస్తున్నాము. ఈ విధానం నిర్దేశిత ప్రాంతీయ కార్యాలయాలకు ప్రయాణించడం, వరుసలో నిలబడ్డం వంటి ఇబ్బందుల నుంచి వినియోగదారుని నివారిస్తుంది'' అని ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ రోహిత్ పి. దాస్ అన్నారు. చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 97 శాతానికి పైగా తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థకు చేరాయని ఆర్‌బీఐ తెలిపింది. అక్టోబర్ 30వ తేదీ నాటికి రూ.10,000 కోట్ల విలువైన నోట్లు మాత్రమే ప్రజల వద్ద ఉన్నాయని పేర్కొంది. ఈ ఏడాది మే 19న ఆర్‌బీఐ రూ.2,000 డినామినేషన్ నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. దేశంలోని 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో ప్రజలు రూ. 2,000 నోట్లను డిపాజిట్ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. రూ.2 వేల నోట్ల డిపాజిట్ లేదా మార్పిడి సేవలను బ్యాంకు శాఖలు అక్టోబర్ 7 వరకు అందించాయి. అక్టోబర్ 8 నుంచి ఈ సేవలు 19 ఆర్‌బీఐ కార్యాలయాలకు మారాయి.

కోటక్ ఇన్సూరెన్స్‌లో 'జ్యూరిక్'కు వాటాలు

51% కొనుగోలు ; డీల్ విలువ రూ. 4,051 కోట్లు

ముంబై: సాధారణ బీమా సంస్థ కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో (కేజీఐ) స్విట్జర్లాండ్‌కు చెందిన జ్యూరిక్ ఇన్సూరెన్స్ 51 శాతం వాటాలు దక్కించుకోనుంది. ఇందుకోసం రూ. 4,051 కోట్లు వెచ్చించనుంది. తదుపరి అదనంగా మూడేళ్లలో అదనంగా 19 శాతం వాటాలు కూడా జ్యూరిక్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయనున్నట్లు కేజీఐ మాతృ సంస్థ కోటక్ మహీంద్రా బ్యాంక్ వెల్లడించింది. వృద్ధి అవకాశాలు పటిష్టంగా ఉన్న కీలక మార్కెట్లలో భారత్ కూడా ఒకటని, కేజీఐ తమకు పటిష్టమైన భాగస్వామి కాగలదని జ్యూరిక్ సీఈవో (ఆసియా పసిఫిక్) తులసి నాయుడు తెలిపారు. తమ కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇరు సంస్థల వనరులు, అనుభవం తోడ్పడగలవని కోటక్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ దీపక్ గుప్తా పేర్కొన్నారు. ప్రీమియంలపరంగా నాన్-లైఫ్ మార్కెట్‌లో సెప్టెంబర్‌లో కేజీఐకి 0.52 శాతం వాటా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం రూ. 1,148 కోట్ల మేర స్థూల ప్రీమియం సాధించింది. కొత్త పెట్టుబడుల అనంతరం సంస్థ విలువ రూ. 7,943 కోట్లుగా ఉండనుంది.

ఫ్యాషన్ స్టార్టప్స్‌లో అజియో పెట్టుబడులు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 100 డైరెక్ట్ టు కస్టమర్ ఫ్యాషన్ స్టార్టప్స్‌లో పెట్టుబడి పెట్టాలని లైఫ్‌స్టైల్, ఫ్యాషన్ ఈ-కామర్స్ కంపెనీ అజియో భావిస్తోంది. ఈ స్టార్టప్స్ తయారు చేసే, విక్రయించే దుస్తులు, పాదరక్షలు, యాక్సెసరీస్ వంటి ఉత్పత్తులను డైరెక్ట్ టు కన్స్యూమర్ వేదిక అయిన అజియోగ్రామ్‌లో అందుబాటులో ఉంచనుంది. భారతీయ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ విభాగంలోని 200 బ్రాండ్స్‌ను ఎక్స్‌క్లూజివ్‌గా అజియోగ్రామ్‌లో వచ్చే ఏడాదికల్లా చేర్చనున్నట్లు వెల్లడించింది. ఈ బ్రాండ్స్ విస్తరణకు, ఆదాయ వృద్ధికి పూర్తి సహకారం అందించనున్నట్లు అజియో ప్రకటించింది.

దాతృత్వంలో శివ్ నాడార్ టాప్

- రూ. 2,042 కోట్ల విరాళం
- ఎడెల్‌గివ్ హురున్ ఇండియా లిస్టులో అగ్రస్థానం



ముంబై: విరాళాలివ్వడంలో ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చీఫ్ శివ్ నాడార్ మరోసారి తన ఉదారత చాటుకున్నారు. 2023లో ఏకంగా రూ. 2,042 కోట్లు విరాళమిచ్చి ఎడెల్‌గివ్ హురున్ ఇండియా 2023 జాబితాలో అగ్రస్థానంలో నిల్చారు. గతేడాది ఇచ్చిన రూ. 1,161 కోట్లతో పోలిస్తే ఇది 76 శాతం అధికం. విప్రో అధినేత అజీమ్ ప్రేమ్‌జీ రూ. 1,774 కోట్లతో (గతేడాదితో పోలిస్తే 267 శాతం అధికం) రెండో స్థానంలోనూ, రూ. 376 కోట్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ ముకేశ్ అంబానీ మూడో స్థానంలో ఉన్నారు. అంబానీ విరాళాలు గతేడాదితో పోలిస్తే 8 శాతం తగ్గాయి. ఆదిత్య బిర్లా గ్రూప్ చీఫ్ కుమార మంగళం బిర్లా రూ. 287 కోట్లతో నాలుగో స్థానంలో, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ రూ. 285 కోట్లతో (50 శాతం అధికం) ఈ జాబితాలో అయిదో స్థానంలో ఉన్నారు. ఇటీవలి హురున్ కుబేరుల జాబితా ప్రకారం అంబానీ సంపద రూ. 8.08 లక్షల కోట్లుగాను, అదానీది రూ. 4.74 లక్షల కోట్లు, నాడార్ సంపద రూ. 2.28 లక్షల కోట్లుగాను ఉంది. సంపద పెరిగే కొద్దీ సంపన్న కుటుంబాలు .. అట్టడుగు వర్గాల వారి కోసం ఆహారం, దుస్తులు, ఉపకార వేతనాలు మొదలైన దాతృత్వ కార్యకలాపాలకు విరాళాలిచ్చే ధోరణి పెరుగుతోందని హురున్ ఇండియా చీఫ్ రీసెర్చర్ అనాస్ రెహ్మాన్ జునైద్ తెలిపారు. లిస్టులో మొత్తం 119 మంది వ్యక్తులు, కుటుంబాలు ఉన్నాయి.

మరిన్ని వివరాలు..

- బజాజ్ కుటుంబంతో పాటు సైరస్ ఎస్ పూనావాలా, అదార్ పూనావాలా, రోహిణి నీలేకని వంటి వారు టాప్ 10లో నిల్చారు. మహిళల్లో నీలేకనితో పాటు అను ఆగా (థర్మాక్స్), లీనా గాంధీ తివారీ (యూఎస్‌వీ) కూడా ఉన్నారు.
- డిస్కౌంటు బ్రోకరేజీ జిరోధా సహ-వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ ఈ జాబితాలో అత్యంత పిన్న వయస్కుడు. కామత్ సోదరులు రూ. 110 కోట్లు విరాళమిచ్చారు.
- రూ. 150 కోట్ల విరాళంతో ఎల్అండ్‌టీ గౌరవ చైర్మన్ ఏఎం నాయక్ .. ప్రొఫెషనల్స్ జాబితాలో అగ్రస్థానంలో, ఓవరాల్ లిస్టులో 11వ స్థానంలో ఉన్నారు.

గెయిల్‌కు బీపీసీఎల్ ముడిసరుకు సరఫరా

రూ. 63,000 కోట్ల ఒప్పందం

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో నెలకొల్పుతున్న పెట్రోకెమికల్ ప్లాంటుకు అవసరమైన ముడిసరుకు కోసం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్)తో గెయిల్ (ఇండియా) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ రూ. 63,000 కోట్లు. దీని ప్రకారం 15 ఏళ్ల పాటు గెయిల్‌కు చెందిన ఉసార్ ప్లాంటుకు బీపీసీఎల్ తమ ఎల్‌పీజీ దిగుమతి కేంద్రం నుంచి ఏటా 6 లక్షల టన్నుల ప్రొపేన్ గ్యాస్‌ను సరఫరా చేయనుంది. ఉసార్‌లో 5,00,000 టన్నుల సామర్థ్యంతో గెయిల్ దేశీయంగా తొలి ప్రొపేన్ డీహైడ్రోజినేషన్ (పీడీహెచ్) ప్లాంటును నిర్మిస్తోంది. ఈ ప్లాంటు 2025 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఫర్నిచర్ ఉపకరణాలు, బొమ్మలు మొదలైన వాటిలో ఉపయోగించే పాలీప్రొపిలీన్ తయారీ ప్లాంటుకు ఇది అనుసంధానమై ఉంటుంది.

మార్కెట్‌కు 'ఫెడ్' బూస్ట్!

- ఫెడరల్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీ రేట్లు యథాతథం
- కలిసొచ్చిన ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో జోష్
- 490 పాయింట్లు పెరిగి 64 వేల స్థాయి పైకి సెన్సెక్స్
- 144 పాయింట్ల లాభంతో 19,100 పైకి నిఫ్టీ

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఊహించినట్లే యథాతథంగా ఉంచడంతో పాటు సరళతర ద్రవ్య విధాన అమలు వ్యాఖ్యలు ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు నింపాయి. దేశీయంగా వాహన విక్రయాలు రికార్డు గరిష్టానికి చేరుకోవడం, జీఎస్‌టీ వసూళ్లు పెరగడం, కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు మెప్పించడం కలిసొచ్చాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 490 పాయింట్లు పెరిగి 64,081 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 144 పాయింట్లు బలపడి 19,133 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం భారీ లాభాల్లో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు ఆద్యంతం జోరు కనబరిచాయి. ఒక దశలో సెన్సెక్స్ 611 పాయింట్లు దూసుకెళ్లి 64,203 వద్ద, నిఫ్టీ 186 పాయింట్లు బలపడి 19,175 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. రియల్టీ, ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా షేర్లకు చిన్న, మధ్య తరహా షేర్లు భారీ డిమాండ్ లభించింది. దీంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు ఒకశాతానికి పైగా ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,261 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1380 కోట్ల షేర్లు కొన్నారు. ఫెడ్ రిజర్వ్ నుంచి సానుకూల సంకేతాలు, జపాన్ ప్రభుత్వం 113 బిలియన్ డాలర్ల ఉద్దీపన ప్యాకేజీకి ప్రకటన, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ సైతం వడ్డీరేట్ల జోలికెళ్లకపోవడం తదితర పరిణామాలతో ఆసియా, యూరప్ మార్కెట్లు 1-2% ర్యాలీ చేశాయి. అమెరికా స్టాక్ మార్కెట్లు 1-1.5 శాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.



- సెన్సెక్స్ ర్యాలీతో బీఎస్ఈలో ఇన్వెస్టర్లు సంపదగా భావించే కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3.1 లక్షల కోట్లు పెరిగి రూ. 313.32 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 షేర్లలో టెక్ మహీంద్రా(1%), బజాజ్ ఫైనాన్స్(0.25%) మాత్రమే నష్టపోయాయి.
- క్యూ2 నికర లాభం ఐదు రెట్లు వృద్ధి సాధించడంతో జేకే టైర్ షేరు 10% లాభపడి రూ.337 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 14% ర్యాలీ చేసి రూ.351 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- క్యూ2 ఫలితాల ప్రకటన తర్వాత హీరో మోటోకార్ప్ షేరులో లాభాల స్వీకరణ జరిగింది. 1% నష్టపోయి రూ.3050 వద్ద స్థిరపడింది.

లాభాల్లోకి టాటా మోటార్స్

- క్యూ2లో రూ. 3,783 కోట్లు
- జేఎల్ఆర్ అమ్మకాలు జూమ్



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్(క్యూ2)లో రూ. 3,783 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది (2022-23) ఇదే కాలంలో రూ. 1,004 కోట్ల నికర నష్టం ప్రకటించింది. బ్రిటిష్ లగ్జరీ కార్ల అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్ఆర్) పనితీరు లాభాలకు దోహదపడింది. వెరసి వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ లాభాలను ప్రకటించగలిగింది. ఆదాయం రూ. 79,611 కోట్ల నుంచి రూ. 1,05,128 కోట్లకు దూసుకెళ్లింది. ఇక స్టాండెలోన్ ప్రాతిపదికన సైతం రూ. 1,270 కోట్ల నికర లాభం సాధించగా.. గతేడాది క్యూ2లో రూ. 293 కోట్ల నికర నష్టం నమోదైంది.

ఇకపై మరింత దూకుడు: తాజా సమీక్షా కాలంలో జేఎల్ఆర్ ఆదాయం 30 శాతం జంప్ చేసి 6.9 బిలియన్ పౌండ్లకు చేరింది. హోల్‌సేల్ అమ్మకాలు, కొత్త ప్రొడక్టులు, వ్యయ నియంత్రణలు, డిమాండుకు అనుగుణమైన పెట్టుబడులు ఇందుకు సహకరించాయి. కాగా.. ఈ ఏడాది ద్వితీయార్థం(అక్టోబర్-మార్చి)లో హోల్‌సేల్ అమ్మకాలు క్రమంగా జోరందుకోనున్నట్లు కంపెనీ అంచనా వేస్తోంది. నిర్వహణ(ఇబిట్) మార్జిన్లు గత 6 శాతం అంచనాలకంటే అధికంగా 8 శాతాన్ని తాకవచ్చని భావిస్తోంది. ఈ ఏడాది 2 బిలియన్ పౌండ్ల ఫ్రీ క్యాష్‌ఫ్లోను సాధించగలదని ఆశిస్తోంది. వెరసి మార్చికల్లా నికర రుణ భారం బిలియన్ పౌండ్లకంటే దిగువకు చేరవచ్చని అభిప్రాయపడింది.

ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు 1.5% బలపడి రూ. 637 వద్ద ముగిసింది.

ర్యాలీలు, మీటింగులుండవ్!

బ్యానర్లు, నినాదాలు అస్సలుండవు • మిజోరంలో ప్రచారం రూటే వేరు

ఎన్నికలంటేనే బోలెడంత హడావుడి, ప్రచారం, సభలు, సందడి. మరీ ముఖ్యంగా మన దేశంలోనైతే ఆ ఊపే వేరు. కానీ మిజోరంలో మాత్రం ఈ పరిస్థితి ఎక్కడా కనిపించదు. పార్టీల ర్యాలీలు, భారీ బహిరంగ సభలు, రోడ్లను బ్లాక్ చేసేయడం వంటివి కాగడా వేసి వెదికినా ఎక్కడా కనిపించవు. అసలు రోడ్లపై గానీ, మరెక్కడైనా నినాదాలు విన్పించడం, బ్యానర్లు కన్పించడం కూడా ఉండదంటే అతిశయోక్తి కాదు!

ప్రచారమంతా చర్చి ఆధ్వర్యంలోనే...

మిజోరంలో అత్యంత బలమైనది చర్చి వ్యవస్థ. రాష్ట్రంలో పార్టీల ఎన్నికల ప్రచార ప్రక్రియ ఆసాంతం చర్చి ఆధ్వర్యంలో నడిచే మిజో పీపుల్స్ ఫోరం (ఎంపీఎఫ్) చర్చి కనుసన్నల్లోనే జరుగుతుంది. గత మూడు ఎన్నికల నుంచీ ఇది మరింతగా కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.



ఏం చేస్తుంది?

- ఎంపీఎఫ్ అసెంబ్లీ స్థానాలవారీగా కమ్యూనిటీ సమావేశాలు ఏర్పాటు చేస్తుంది.
- ఆ నియోజకవర్గంలోని అందరు అభ్యర్థులూ అక్కడికే వస్తారు.
- తమ విధానాలు, పథకాలు తదితరాలను ఒక్కొక్కరుగా ప్రజల ముందు పెడతారు.
- ఇందుకు ఒక్కొక్కరికి 20 నిమిషాలు టైం కేటాయిస్తారు.
- ఏ గొడవలకు, ఉద్రిక్తతలకు తావులేకుండా కార్యక్రమం సాగుతుంది.

దేశమంతటా ఎన్నికల ప్రచారం ఇలాగే సాగాలంటూ చట్టం తెస్తే బాగుంటుందేమో కదా!

పంచతంత్రం



మహిళలకు మొండిచెయ్యే

అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో ఛత్తీస్‌గఢ్, మిజోరంలకు రెండు ప్రత్యేక రికార్డులున్నాయి. రెండు మహిళలకు సంబంధించినవే కావడం విశేషం. అసెంబ్లీలో మహిళలకు అత్యధిక ప్రాతినిధ్యం కల్పించిన రాష్ట్రంగా ఛత్తీస్‌గఢ్ నిలిస్తే, అత్యల్ప ప్రాతినిధ్యమున్న రాష్ట్రంగా మిజోరం చెత్త రికార్డును మూటగట్టుకుంది. దాని చరిత్రలో ఇప్పటిదాకా ఎమ్మెల్యేలైన మహిళల సంఖ్య కేవలం నాలుగే! ప్రస్తుత మిజోరం అసెంబ్లీలోనైతే ఒక్కరంటే ఒక్క మహిళా ఎమ్మెల్యే కూడా లేరు! అంతేకాదు, 2014 ఉప ఎన్నికలో నెగ్గిన వన్లాల్‌వాంపుయ్ చోంగ్తూను మినహాయిస్తే గత 27 ఏళ్లలో రాష్ట్రంలో ఒక్క మహిళ కూడా ఎమ్మెల్యేగా ఎన్నికవలేదు! ఇక లోక్‌సభకైతే మిజోరం చరిత్రలోనే ఇప్పటిదాకా ఒక్క మహిళ కూడా ఎన్నికవలేదు! ఇక ఇప్పటిదాకా ఇద్దరంటే ఇద్దరు మహిళలు మాత్రమే మంత్రులయ్యారు!

- మిజోరం అసెంబ్లీలో కానరాని స్త్రీలు
- దేశంలోకెల్లా అత్యల్ప ప్రాతినిధ్యం
- ఇప్పటిదాకా నలుగురే మహిళా ఎమ్మెల్యేలు
- లోక్‌సభకైతే మహిళల ప్రాతినిధ్యం సున్నా

ఆది నుంచీ...

కేంద్రపాలిత ప్రాంతం హోదాలో మిజోరంలో 1972లో తొలిసారి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు కేవలం నలుగురు మహిళలు మాత్రమే పోటీ చేశారు. వారిలో ఒక్కరూ నెగ్గకపోగా డిపాజిట్లు కూడా కోల్పోయారు. 1978లో ఎల్.థన్‌మావీ రూపంలో మిజోరంలో తొలిసారి ఒక మహిళ ఎమ్మెల్యేగా నెగ్గింది. ఆమెకు పడ్డ మొత్తం ఓట్లెన్నో తెలుసా? కేవలం 1,824. కేవలం 119 ఓట్ల మెజారిటీతో గట్టెక్కారామె! అన్నట్టు, ఆ ఎన్నికల్లో పోటీ చేసిన ఏకైక మహిళ కూడా ఆమే. అనంతరం ఏడాది లోపే మళ్లీ జరిగిన ఎన్నికల్లోనూ నలుగురు పురుష అభ్యర్థులతో తలపడి కేవలం 42 ఓట్ల మెజారిటీతో మళ్లీ గెలిచారామె. ఆ ఎన్నికల్లో బరిలో దిగిన మరో ఇద్దరు మహిళలు డిపాజిట్ కోల్పోయారు. 1987లో మిజోరం రాష్ట్రంగా మారాక జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో నలుగురు మహిళలు పోటీ పడ్డారు. ఎంఎన్ఎఫ్ తరఫున లాల్‌హ్లింపుయ్ మర్ ఐజ్వాల్ నార్త్-1 నుంచి కేవలం 306 ఓట్ల మెజారిటీతో నెగ్గారు. అనంతరం లాల్‌డెంగా మంత్రివర్గంలోనూ చోటు దక్కించుకున్నారు. మంత్రి అయిన తొలి మిజో మహిళగా రికార్డు సృష్టించారు. అనంతరం 1989, 1993 అసెంబ్లీ ఎన్నికల్లో నలుగురేసి మహిళలు పోటీ చేసినా ఓటమి చవిచూశారు. 1998లో 10 మంది, 2003లో ఏడుగురు, 2008లో 9 మంది, 2013లో ఆరుగురు మహిళలు పోటీ చేసినా ఒక్కరూ నెగ్గలేదు. అలా 27 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత 2014లో ఉప ఎన్నికలో నెగ్గిన చోంగ్తూ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి అయ్యారు. అయితే ఆమెకు దక్కింది... మత్స్య, సహకార శాఖలు! కానీ, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె ఓటమి చవిచూశారు. ఆ ఎన్నికల్లో అత్యధికంగా 18 మంది మహిళలు పోటీ చేసినా ఒక్కరూ గెలుపు ముఖం చూడలేకపోయారు. పైగా ఏకంగా 16 మంది డిపాజిట్లు గల్లంతయ్యాయి.

ఈసారి...

- ఎంఎన్ఎఫ్, కాంగ్రెస్, జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) ఇద్దరేసి మహిళలకు టికెట్లివ్వగా
- బీజేపీ ముగ్గురికిచ్చింది. మొత్తమ్మీద ఈసారి 16 మంది మహిళలు ఎన్నికల బరిలో దిగారు.

ఎందుకిలా...?

మిజోరంలో చట్టసభల్లో మహిళలకు అత్యల్ప ప్రాతినిధ్యానికి అక్కడి పితృస్వామ్య వ్యవస్థే ప్రధాన కారణమని చెబుతారు. పరిశీలిస్తే అది నిజమేననిపిస్తుంది కూడా. క్రైస్తవ జనాభా ఎక్కువగా ఉన్నా మిజోరం ప్రధానంగా గిరిజన రాష్ట్రం. సహజంగానే అక్కడ మహిళలకు ఇల్లు దాటి బయటికి వెళ్లడాన్ని అంతగా ఇష్టపడరు.

- సాక్షి, నేషనల్ డెస్క్





ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా సంప్రదాయక డోలు వాయిస్తున్న జార్ఖండ్ బీజేపీ అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ. గురువారం ఛత్తీస్‌గఢ్‌లోని కుంకురీ నియోజకవర్గంలోని ఖుత్గావ్ పట్టణంలో తీసిన ఫొటో

ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ

కాంగ్రెస్ ఉన్నచోట అభివృద్ధి ఉండదు

కాంకేర్: వారసత్వ రాజకీయాలు, అవినీతి, బంధుప్రీతికి మారుపేరైన కాంగ్రెస్ పార్టీకి అధికారమిస్తే అభివృద్ధి ఏమాత్రం జరగదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్‌లో గురువారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడారు. అవినీతికి పాల్పడుతోందంటూ సీఎం భూపేశ్ బఘేల్ ప్రభుత్వాన్ని ఎండగట్టిన ప్రధాని మోదీ..రాష్ట్రాన్ని దోచుకున్న వారిని ఏమాత్రం ఉపేక్షించరాదన్నారు. దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా తమ ప్రభుత్వం రాష్ట్రపతి పదవికి గిరిజన మహిళను ఎంపిక చేయగా దానిని కూడా కాంగ్రెస్ వ్యతిరేకించిందని ద్రౌపదీ ముర్ము ఎన్నికనుద్దేశించి ప్రధాని చెప్పారు. ఇలాంటి వైఖరి కలిగిన కాంగ్రెస్ పార్టీకి ఛత్తీస్‌గఢ్‌లోని ప్రతి గిరిజనుడూ ప్రతీకారం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ను మీరు శిక్షిస్తారా అని ప్రధాని ప్రశ్నించగా అవును అంటూ జనం బదులిచ్చారు. ఇతర వెనుకబడిన కులాని(ఓబీసీ)కి చెందినందునే 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తనను దూషించిందని తెలిపారు. కేంద్రంలో అధికారం కోల్పోయాక పార్టీ ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లో అవినీతితో ఖజానా నింపుకుంటోందని కాంగ్రెస్‌ను దుయ్యబట్టారు. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం యువతను నిర్లక్ష్యం చేసిందని, ఎన్నికల హామీలను నెరవేర్చ లేకపోయిందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో సీఎం బఘేల్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాన్ని కాంగ్రెస్ కమిటీ కార్యాలయంగా మార్చేసి, ప్రభుత్వంలో పెద్దల పిల్లలు, బంధువులకు ఉద్యోగాలిచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు అధికారమిస్తే బస్తర్ ప్రాంతంలోని పేదలు, దళితులు, వెనుకబడిన కులాలు, గిరిజన కుటుంబాలకు హత్యలు, నేరాలు, హింస తప్ప ఏం లాభం కలిగింది? అని ప్రశ్నించారు. 'అందుకే, రాష్ట్రాన్ని దోచుకున్నవారు ఎంత శక్తిమంతులైనప్పటికీ వదలరాదు. దోచుకున్నదంతా వారి నుంచి కక్కిస్తాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నచోట అభివృద్ధి ఉండదు'అని మోదీ అన్నారు. మీ పిల్లల భవిష్యత్తును మోదీ, బీజేపీ చేసుకుంటాయని ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లో తాము అధికారంలోకి వస్తే అభివృద్ధిని వేగవంతం చేసి, సుసంపన్నమైన ఛత్తీస్‌గఢ్‌కు పునాది వేస్తాం. రాష్ట్రాన్ని వచ్చే అయిదేళ్లలో దేశంలోనే అగ్రగామిగా నిలబెడతాం. పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణం వేగవంతం చేస్తాం'అని ప్రధాని ప్రకటించారు.

మెజారిటీ రాకున్నా సరే, బీజేపీని మాత్రం కలుపుకోం: జెడ్‌పీఎం

ఐజ్వాల్: ఈ నెల 7న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించడంలో తమ పార్టీ విఫలమైనప్పటికీ, బీజేపీ మద్దతు మాత్రం తీసుకోబోమని జోరం పీపుల్స్ మూవ్‌మెంట్(జెడ్‌పీఎం) కుండబద్దలు కొట్టింది. జెడ్‌పీఎం వర్కింగ్ చైర్మన్ కె.సప్తంగ మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్ర ప్రజలు కొత్త ప్రభుత్వం, కొత్త పాలనా విధానం రావాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వారు సంకీర్ణప్రభుత్వాన్ని కోరుకోవడం లేదు. ఎన్నికల తర్వాత మా పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకున్నా, బీజేపీ మద్దతు తీసుకోవడం, ఆ పార్టీతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ జరగదు'అని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత జట్టుకట్టేందుకు కాంగ్రెస్, బీజేపీలు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల తర్వాత జెడ్‌పీఎం, అధికార ఎంఎన్ఎఫ్‌లలో ఎక్కువ సీట్లు సాధించిన పార్టీతో చేతులు కలుపుతామంటూ బీజేపీ చేసిన ప్రకటనపై పైవిధంగా సప్తంగ స్పందించారు. ఈ నెల 7న జరగనున్న ఎన్నికల్లో తమదే గెలుపని, సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.